నమస్తే తెలంగాణ
నల్లగొండ
3 | నల్లగొండ, శనివారం 7 డిసెంబర్ 2024 | NALGONDA

• బాబా సాహెబ్‌కు నివాళి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నివాళులర్పించారు. సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డు, రైతుబజార్ వద్ద గల అంబేద్కర్ విగ్రహాలకు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

పూర్తి కాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవమా?

నేడు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి

- బీఆర్ఎస్ హయాంలో ట్రయల్ రన్ పూర్తి
- కొత్తగా తవ్విన కాల్వలు లేవు... పారుగంత లేదు
- ఏడాదిలో కాంగ్రెస్ సర్కార్ ఖర్చు చేసిన నిధులేవి?
- పెండింగ్‌లో భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీల వ్యవస్థ
- అవి పూర్తయితేనే నెరవేరనున్న ప్రాజెక్టు లక్ష్యం
- ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ విస్తరణ కూడా అవసరం
- ప్రారంభించడంలో ఉన్న ఉత్సాహం నిధుల కేటాయింపులో ఏది? : మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : పానగల్ ఉదయసముద్రం రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోస్తూ లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంతో తలపెట్టిన బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తైనట్లేనా? పూర్తయితే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఎన్ని ఎకరాల ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయనున్నారు? అన్నది జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఏ ప్రాజెక్టునైనా పనులన్నీ పూర్తయ్యాకే ప్రజలకు అందుబాటులోకి తెస్తారు. కానీ బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు విషయంలో ప్రారంభోత్సవం అనే పదానికే రేవంత్ సర్కార్ కొత్త భాష్యం చెప్పున్నది. ప్రాజెక్టులోని అన్ని పంపులు పూర్తి స్థాయిలో రన్ కాలేదు. రిజర్వాయర్ పనులు ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధాన కాల్వల తవ్వకం 50 శాతం కూడా పూర్తి కాలేదు. వీటి నుంచి కీలకమైన డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు భూ సేకరణే జరుగలేదు. అవి ఇప్పటిలో తవ్వే పరిస్థితే లేదు. ఇప్పట్లో ఒక్క ఎకరాకూ నీరు పారేది లేదు. ఆ నీటితో పంటలు పండేది లేదు. అయినా సరే ప్రాజెక్టు పూర్తయినట్లు మభ్య పెడుతూ ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. అందుకోసం ఏకంగా శంకుస్థాపన పైలాన్ పక్కనే ప్రారంభోత్సవానికి సైతం పైలాన్‌ను సిద్ధం చేయడం గమనార్హం. తన కలల ప్రాజెక్టు అని చెప్పుకొనే బ్రాహ్మణ వెల్లంల ఎత్తిపోతలను అసంపూర్తిగా ప్రారంభింప చేయడంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఉన్న 'ప్రత్యేక శ్రద్ధ' ఎంటో అనేది చర్చనీయాంశంగా మారింది.

శాశ్వత నీటి కేటాయింపులు లేకుండా కేవలం పానగల్ ఉదయ సముద్రం రిజర్వాయర్‌పై ఆధారపడి 2007లో బ్రాహ్మణవెల్లంల ఎత్తిపోతల పథకానికి అప్పటి కాంగ్రెస్ సర్కార్ శ్రీకారం చుట్టింది. లక్ష ఎకరాలకు సాగునీరు, 107 గ్రామాలకు తాగునీరు లక్ష్యంగా రూ.699 కోట్ల అంచనా వ్యయంతో 2007 సెప్టెంబర్ 4న శంకుస్థాపన జరిగింది. 2012 ఆగస్టులోనే పనులు పూర్తి చేసి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ప్రకటించారు. 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ప్రాజెక్టును పూర్తిగా అటకెక్కించింది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సర్కార్ కొంత కుదుటపడ్డాక దీనికి దశలవారీగా నిధులు కేటాయిస్తూ వచ్చింది. 2018 నుంచి పనులు వేగవంతం చేస్తూ పంపుహౌస్, రిజర్వాయర్ పనులు, పానగల్ ఉదయ సముద్రం నుంచి అప్రోచ్ కెనాల్ పటిష్టం, సొరంగ మార్గం పనులు లైనింగ్, విద్యుత్ పనులను పూర్తి చేసింది. అందుకు సుమారు రూ.130 కోట్లు వెచ్చించింది. గత ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో ట్రయల్ రన్‌ను పూర్తి చేసింది. నీటిని ఎత్తి రిజర్వాయర్‌లో పోయడంతో ట్రయల్ రన్ సక్సెస్ అయినట్లు అధికారులు ప్రకటించారు. ఇక భూసేకరణపై దృష్టి సారించి ప్రధాన కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటరీలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తుండగా 2023 ఆగస్టు నుంచి ఎన్నికల వాతావరణ మొదలైంది. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పనుల్లో కదలిక మందగించింది. ఈ ఏడాది కాలంలో ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పనులేవీ లేవు. నిధులు కూడా కేటాయించిన దాఖలాల్లేవు. తిరిగి మరోసారి ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించి నీటిని ఎత్తిపోసారు. భూ సేకరణ కోసం నిధులు ఇవ్వలేదు. కాల్వల తవ్వకంపైనా దృష్టి పెట్టలేదు. ఇవేవీ పూర్తి కాకుండానే ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినట్లు భ్రమింపజేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభోత్సవానికి వస్తున్నారు. అందుకోసం ప్రత్యేకంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభోత్సవ పైలాన్‌ను కూడా ఆవిష్కరణకు సిద్ధం చేశారు.

ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టు పైలాన్

అసంపూర్తిగా ప్రాజెక్టు

ప్రాజెక్టులో కీలకమైన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థనే పెండింగ్‌లో ఉంది. దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయితేనే కాల్వలు తవ్వి, సాగునీటిని అందించే అవకాశం ఉంటుంది. కానీ దీనిపై నేటికి కాంగ్రెస్ సర్కార్ దృష్టి సారించిన దాఖలాలు లేవు. ప్రధాన కాల్వ, డిస్ట్రిబ్యూటరీల కోసం 3.851 ఎకరాలను సేకరించాల్సి ఉండగా, 1.456 ఎకరాలను సేకరించారు. కుడి కాల్వకు సంబంధించి 25.5 కిలోమీటర్లకు గానూ 11 కిలోమీటర్లు పూర్తయ్యింది. ఎడమ కాల్వ కోసం 6.5 కిలోమీటర్ల భూ సేకరణకు గానూ 4.5 కిలోమీటర్లు పూర్తయ్యింది. ఇక భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లోనూ కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల తవ్వకాలు చేపట్టాల్సి ఉంది. ఎడమ కాల్వ ద్వారా 43 వేల ఎకరాలకు, కుడి కాల్వ ద్వారా 57వేల ఎకరాలకు సాగునీరు అందించాలనేది ప్రాజెక్టు ఉద్దేశ్యం. ఇప్పటివరకు కాల్వలకు నీటిని విడుదల చేసే వ్యవస్థనే సిద్ధం కాలేదు. కేవలం రిజర్వాయర్‌లో నీటిని ఎత్తిపోసి కొంతమేర నిల్వ చేయడం వరకే పనులు పూర్తయ్యాయి. ఇవన్నీ కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే పూర్తికావడం విశేషం. దాంతోపాటు అక్కంపల్లి నుంచి పానగల్ వరకు వచ్చే ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ సామర్థ్యం 1,200 క్యూసెక్కులకు మించడం లేదు. ప్రస్తుతం ఉన్న ప్రధాన కాల్వ సామర్థ్యంతో బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అనేది అసాధ్యంగానే కనిపిస్తుంది. అందువల్ల ప్రస్తుతం ఉన్న కాల్వ సామర్థ్యాన్ని కనీసం 3వేల క్యూసెక్కుల సామర్థ్యానికి విస్తరిస్తూ లైనింగ్ పనులు చేపట్టాలన్న డిమాండ్ పెరుగుతుంది. రానున్న రోజుల్లో ఎల్ఎల్‌బీసీ సొరంగ మార్గం కూడా అందుబాటులోకి వస్తే ఆ నీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడానికి విస్తరణ, లైనింగ్ పనులు తోడ్పడతాయని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి సూచిస్తున్నారు. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి తన పర్యటనతో దీనిపై ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.500 కోట్ల కేటాయించాలి : చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టుకు కేసీఆర్ సర్కార్ హయాంలోనే ట్రయల్‌రన్ నిర్వహించాం. మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్‌లో నీటిని ఎత్తిపోసాం. ఈ లోపే ఎన్నికలు రావడంతో మిగతా పనులు మేము కొనసాగించలేకపోయాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొత్తగా చేపట్టిన పనులు లేవు. నిధులు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇంకా కాల్వలు, డిస్ట్రిబ్యూటరీల భూసేకరణ జరపాల్సి ఉంది. కానీ తిరిగి ఈ మధ్య మరోసారి మోటార్లను ఆన్‌చేసి ట్రయల్‌రన్ చేసి తామే చేసినట్లుగా నటిస్తున్నారు. వాస్తవంగా భూసేకరణ చేసి కాల్వలు తవ్వితేనే పొలాలకు సాగునీరు పారుతుంది. ఇది జరగాలంటే మరో రూ.500 కోట్లు కేటాయించాలి. కేవలం ట్రయల్ రన్‌తోనే ప్రాజెక్టును పూర్తిచేసినట్లుగా ప్రారంభించాలనుకోవడం ప్రజలను మోసం చేయడమే. తక్షణమే నేడు అసంపూర్తి ప్రాజెక్టును ప్రారంభించేందుకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అవసరమైన నిధులను మంజూరీ చేసి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలి. లేకుంటే ప్రజలు తగిన సమయంలో బుద్ధిచెప్పడం ఖాయం.

నేడు జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి 2.25గంటలకు బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టకు చేరుకుంటారు. అక్కడ ప్రాజెక్టు ప్రారంభిస్తూ పైలాన్‌ను ఆవిష్కరించి పూజలు నిర్వహిస్తారు. అటునుంచి 2.55 గంటలకు బయల్దేరి దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు చేరుకుంటారు. 3.20 నుంచి 3.40 గంటల వరకు యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని రెండో యూనిట్ ద్వారా 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తారు. అక్కడి నుంచి సాయంత్రం 4.10 గంటలకు బయల్దేరి 4.25 గంటలకు నల్లగొండలోని మెడికల్ కాలేజీకి చేరుకుంటారు. అక్కడి కాలేజీ ప్రారంభోత్సవం పాల్గొని అనంతరం 5గంటలకు అక్కడే రాజీవ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, దామోదర రాజనర్సింహ, జిల్లా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

రేవంత్ ప్రభుత్వం అన్నింటా విఫలం

రాష్ట్రం వెనక్కిపోతున్నదని ప్రభుత్వమే అంగీకరించింది

- ఏడాది కాలంలో ఉమ్మడి జిల్లాకు ఒరిగింది శూన్యం
- మంత్రుల జేబులు ఫుల్... ప్రజల జేబులకు చిల్లు
- ఒక్కటైనా చేశామని ఇద్దరు మంత్రుల్లో ఎవరైనా చెప్పగలరా?
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : 'ఏడాది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా విఫలమైంది. రాష్ట్రంలో ఏడు వేల కోట్ల రూపాయల ఆదాయం తగ్గిందని ప్రతిపక్షమో, ఆర్థిక నిపుణులో, మేధావులో కాకుండా స్వయాన కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలే అంగీకరించారు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనపై నమస్తే తెలంగాణతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల జేబులు నిండుతుండగా ప్రజల జేబులకు చిల్లు పడుతున్నదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఏడాది కాలంలో ఒక్కటంటే ఒక్కటైనా చేశామని చెప్పుకోగలరా అని ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు కండ్ల ముందే నాశనం అవుతుండడం చూసి కాంగ్రెస్ పార్టీ దరిద్రాన్ని ఎందుకు తెచ్చుకున్నామా ప్రజలు మదన పడుతున్నారని తెలిపారు.

పరిస్థితులు సాధారణంగా ఉన్నా ఆదాయం తగ్గడం ఏంటి?

'రాష్ట్రంలో అన్ని పరిస్థితులు సాధారణంగా ఉన్నాయి. వర్షాలు సమృద్ధిగా పడ్డాయి. ప్రాజెక్టు కూలిందని ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వమే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేసి నీటిని తరలించింది. రైతులు పంటలు బాగా పండించారు. అయినా రాష్ట్ర ఆదాయం తగ్గడానికి కారణం ఏంటటి? కేవలం ప్రభుత్వం నడపడంలో లోపమే'నని అని జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆరు నెలల క్రితం బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ ఇప్పటికే దాదాపు ఏడువేల కోట్ల రూపాయల ఆదాయం తగ్గిందని కాంగ్రెస్ ప్రతినిధులు చెప్పడంతో పాలన చేతగాక రాష్ట్రం తిరోగమనంలోకి వెళుతుందని అర్థమవుతున్నదన్నారు. ప్రజల ఎజెండాను పక్కన పెట్టి సంపాదనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుండడంతో ఈ దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇద్దరు మంత్రులు జిల్లాకు చేసింది శూన్యం

'ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నా ఏడాది కాలంలో ఒక్కటంటే ఒక్కటైనా, ఏదైనా తెచ్చారా? ఇది తెచ్చామని చెప్పుకొనే దుమ్ము ఒక్కరికైనా ఉందా?' అని జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. 2014కు ముందు ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేటలో మూసీ మురికి నీరు తాగగా, నల్లగొండ ప్రాంతంలో ఫ్లోరిన్ నీటిని తాపించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఇంటింటికీ స్వచ్ఛమైన భగీరథ నీటిని అందించామని, సాగునీటిని సాధించి పెట్టామా, లేదా అని రైతులను అడిగితే చెబుతారని పేర్కొన్నారు.

వచ్చిన వాటిని రద్దు చేస్తున్నారు

సూర్యాపేటకు బీఆర్ఎస్ హయాంలో వచ్చిన వాటిని సైతం రద్దు చేయడం సిగ్గుచేటని మాజీ మంత్ర జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. పాలిటెక్నిక్ కళాశాలకు రూ.10 కోట్లు, స్పోర్ట్ కళాశాలకు రూ.25 కోట్లు, రహదారులకు రూ.50 కోట్లు, జనగాం రోడ్డు నుంచి ఖమ్మం రోడ్డుకు రూ.100 కోట్లు మంజూరు చేయిస్తే వాటిని నిలిపి వేశారన్నారు. సగం జరిగిన పనులను కూడా ఆపేశారని, వేలాది ఉద్యోగాలు ఇచ్చేందుకు ఐటీ పార్కు తెస్తే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం నిరాదారణకు గురిచేసి వెళ్లగొట్టిందన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో రెండు మెడికల్ కళాశాలలను 100 శాతం పూర్తి చేశామని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, చెత్త ఎత్తేందుకు ట్రాక్టర్లు ఇలా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో ఒక్కటంటే ఒక్కటీ చేయకపోగా, తమ హయాంలో చేసిన వాటిని నాశనం చేస్తున్నదని దుయ్యబట్టారు.

పవర్‌ప్లాంట్‌ను రద్దు చేస్తామన్న మూర్కుడు..

బీఆర్ఎస్ హయాంలో కనీవినీ ఎరుగని రీతిన 4వేల మెగావాట్లతో యాదాద్రి పవర్‌ప్లాంట్‌ను పూర్తి చేస్తే, దానిని రద్దు చేస్తామని జిల్లాకు చెందిన ఓ మూర్కుడు అన్నాడంటూ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. నిజంగా దానిని నాశనం చేస్తాడో ఏమో అనుకున్నామన్నారు. అక్కడ ఏదో చేసినట్లు షో చేసి నాలుగైదు సార్లు హెలీకాప్టర్‌లో చెక్కర్లు కొట్టి ఏదో సాధించినట్లు బిల్డప్ చేసి ఇప్పుడు ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అడ్రస్ లేదు.. 420 హామీలు ఏమైనాయో తెలియదని విమర్శించారు. ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో హైడ్రాతో పేదల ఇండ్లు కూలుస్తూ బ్లాక్‌మెయిల్ చేసున్నారన్నారు. మరోపక్క కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకే నియామక పత్రాలు అందించి కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటుండడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌కు అధికారం వచ్చిన తరువాత ఇచ్చిన నోటిఫికేషన్లు ఎన్నో, ఉద్యోగాలెన్నో నిరుద్యోగులకు తెలుసన్నారు. యావత్ దేశ చరిత్రలోనే సీఎంల్లో కేసీఆర్ హీరో అయితే, రేవంత్ జీరో అని.. ఏ అవకాశం వచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు.

కేసీఆర్ పాలనలోనే వైద్య కళాశాల

- బీఆర్ఎస్ హయాంలోనే మంజూరు.. తరగతులు
- 42 ఎకరాల్లో నిర్మాణానికి రూ. 116 కోట్లు మంజూరు

నీలగిరి, డిసెంబర్ 6 : నల్లగొండ జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయడంతో పాటు 2019 సంవత్సరంలోనే వైద్య తరగతులను ప్రారంభించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. వైద్య కళాశాలకు శాశ్వత భవనం ఉండాలని 2022లోనే 42 ఎకరాల విస్తీర్ణంలో రూ.114 కోట్లు మంజూరు చేయగా, అప్పటి జిల్లా మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పునాది రాయి వేశారు. ఆ నిర్మాణాన్నే శనివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

వైద్య కళాశాల ఏర్పాటు ద్వారా ఎంబీబీఎస్ సీట్లతో పాటు నల్లగొండ జిల్లా ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వం సహకరించక పోయినా మొక్కవోని ముందుకు సాగింది. జిల్లా కేంద్ర దవాఖానలో తాత్కాలిక భవనంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసింది. 2019 సంవత్సరంలో పట్టణ శివారు ప్రాంతంలోని ఎస్ఎల్‌బీసీలో 42 ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పదికరాల విస్తీర్ణంలో 4 లక్షల చదరపు మీటర్లలో కళాశాల భవనంతో పాటు బాలురు, బాలికలకు వేర్వురుగా హాస్టళ్లు, ప్రిన్సిపాల్ క్వాటర్లు నిర్మించింది.

2019లోనే తరగతులు ప్రారంభం..

2018లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండకు మెడికల్ కళాశాల మంజూరు చేయగా, 2019 ఆగస్టులో తరగతులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి 128 సీట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి 22 సీట్లతో కలిపి మొత్తం 150 సీట్లను మంజూరు చేశారు. బోధనకు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్స్ కలిపి 80 మందితో తరగతులు నడిపిస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఏటా 150 మంది చొప్పున 900 మంది మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొంది విద్యాభ్యాసం చేస్తున్నారు. 900 మంది విద్యార్థులు ఉండేందుకు వీలుగా బాలురు, బాలికల హాస్టల్ నిర్మించారు. 5.6 ఎకరాల్లో పార్కులు ఏర్పాటు చేశారు. ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ, కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టారు.

8 విభాగాలుగా నిర్మాణం

నల్లగొండ మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని ఎనిమిది విభాగాలుగా చేపట్టారు. ఐదు బ్లాక్‌ల్లో తరగతి గదులు, లెక్చరర్ గ్యాలరీ, ఒక అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, ఒక బ్లాక్‌లో ఆకడమిక్, ఎగ్జామినరీ హాల్ ఏర్పాటు చేశారు. ప్రయోగశాల బ్లాక్, డిపార్ట్‌మెంట్ బ్లాక్, రెస్టారెంట్‌ను వైద్య విద్యార్థులకు అందుబాటులో ఉండేలా నిర్మించారు. బాలురకు జీ+5, బాలికలకు జీ+4, ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్, ప్రొఫెసర్లు, ఉండేందుకు వీలుగా జీ+3 సామర్థ్యంతో ప్రిన్సిపల్ క్వాటర్స్ నిర్మాణం చేపట్టారు.

కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

నల్లగొండ సిటీ : నల్లగొండకు మెడికల్ కళాశాలను మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టినందుకు గానూ బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో శుక్రవారం కనగల్ సెంటర్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా శ్రీను మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ చేపట్టిన నిర్మాణాలనే నేడు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తున్నారన్నారు. కార్యక్రమంలో తలారి పరమేశ్, మల్లేపల్లి అనిల్‌కుమార్, తలారి వెంకన్న, అంబటి ప్రవీణ్, అఖిల్, వరప్రసాద్, యాదయ్య, దుబ్బ రాజు పాల్గొన్నారు.

వెలుగులు విరజిమ్మనున్న పవర్ ప్లాంట్

- కేసీఆర్ హయాంలోనే 90శాతం పనులు పూర్తి
- నేడు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో రెండో యూనిట్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- 1,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

దామరచర్ల, డిసెంబర్ 6 : కేసీఆర్ ఆనవాళ్లను తుడిచేస్తామంటూ అడ్డగోలుగా నోరు పారేసుకున్న నేతలే నేడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కీర్తిని లోకానికి చాటి చెప్పక తప్పడం లేదు. దక్షిణ భారత దేశంలోనే రెండో అతిపెద్దదైన యాదాద్రి సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంటును సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించనున్నారు. దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామ శివారులో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటి సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌లో స్టేజీ-1లోని ఒకటి, రెండు యూనిట్లు పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమయ్యాయి. 4,600 ఎకరాల్లో రూ.34వేల కోట్లతో 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించిన మొత్తం ఐదు యూనిట్లు ఉండగా, రెండో యూనిట్ నుంచి 1,600 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తికి శ్రీకారం చుట్టనున్నారు. కేసీఆర్ పాలనలోనే 90 శాతం పనులు పూర్తిచేసుకున్న ప్లాంట్‌లో స్టేజ్-1యూనిట్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రారంభ చిహ్నంగా అధికారులు ఇక్కడ మరొక పైలాన్‌ను నిర్మించారు.

కేసీఆర్ ఆనవాళ్లుగా యాదాద్రి పవర్‌ప్లాంటు

రాష్ట్రంలో విద్యుత్ కష్టాలు ఉండకూడదనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పవర్‌ప్లాంటు ఏర్పాటుకు సంకల్పించి 2014లో పలు ప్రాంతాలను పరిశీలించిన అనంతరం కృష్ణ పట్టెలోని దామరచర్లలో నిర్మాణానికి నిర్ణయించారు. వీర్లపాలెం పరిధిలో నిర్మాణానికి స్థల సేకరణ చేపట్టి, 2015 జూన్ 8న కేసీఆర్ స్వయంగా భూమిపూజ నిర్వహించారు. ఇంజినీరింగ్, పర్యావరణ ప్రభావ అంచనా అధ్యయనాలు 2016లో పూర్తయ్యాయి. పవర్ ప్లాంట్ ప్రతిపాదిత ప్రాంతంలో అధికంగా అడవి ఉండగా, 2015 జూలైలో అటవీ శాఖ అనుమతి లభించింది. నిర్మాణ బాధ్యతలను బీహెచ్ఈఎల్ సంస్థకు అప్పగించారు. అన్ని అనుమతుల అనంతరం తర్వాత అక్టోబర్ 2017లో పనులను ప్రారంభించారు. 2022 నవంబర్‌లో కేసీఆర్ మరోవారు ఏరియల్ సర్వే ద్వారా పనులను పరిశీలించారు.

90 శాతం పనులు బీఆర్ఎస్ సర్కారులోనే పూర్తి

యాదాద్రి పవర్ ప్లాంటులో ఐదు యూనిట్లు పనులు ప్రారంభించినప్పటికీ ఫేజ్-1లో రెండో యూనిట్ 90శాతం పనులను ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. మిగతా యూనిట్లు 70 శాతం పూర్తి చేసుకున్నాయి. యాదాద్రి పవర్ ప్లాంటుపై విశాఖ, ముంబైకి చెందిన స్వచ్ఛంద సంస్థలు ఎంజీటీలో కేసులు వేయడంతో సివిల్ పనులు మాత్రం చేసుకోవచ్చని, విద్యుత్ ఉత్పత్తి చేయవద్దని తీర్పు వచ్చింది. మరోవైపు కొవిడ్ కాలంలో రెండేండ్లు పనులు మందకొడిగా సాగాయి. కొవిడ్ కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో జాప్యం జరిగింది.

రైల్వేలైన్లు పూర్తి.. సింగరేణి బొగ్గు రాక

యాదాద్రి పవర్ ప్లాంటుకు అనుసంధానంగా రైల్వే లైన్లు పూర్తయ్యాయి. విష్ణుపురం నుంచి జాన్‌పహాడ్ రైల్వే లైన్ల మీదుగా పవర్ ప్లాంటుకు ప్రత్యేకంగా రూ.100 కోట్లతో 8.5 కిలోమీటర్ల మేర రెండు రైల్వే లైన్లు నిర్మించారు. ఈ ప్రత్యేక లైన్‌ను సికింద్రాబాద్-గుంటూరు, మోటుమర్రి-జగ్గయ్యపేట మార్గాలకు అనుసంధానం చేయడంతో బొగ్గు రవాణా సులుభం అవుతున్నది. 14 ర్యాక్‌లు నిలిచేలా ప్లాంటులో ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. సింగరేణి నుంచి వ్యాగన్లతో బొగ్గును ప్లాంటుకు తీసుకువస్తున్నారు. నవంబర్ 2న మంత్రులు బట్టి విక్రమార్క బొగ్గు రైలు బోగీని ప్రారంభించారు.

గ్రిడ్లకు అనుసంధానం

పవర్ ప్లాంటులో స్టేజ్-1 కింద మొదటి, రెండో యూనిట